
# పరివర్తన

-ఎ. శ్రీదేవి.



క్రైన్ కథలపోటీలో
సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ

సీతా! సీతా! అంటూ వాకిలి తుడుస్తున్న పనిమనిషిని గట్టిగా అరిచి పిలిచాను. 'ఆయ్! వస్తున్నానండి' అంటూ నెమ్మదిగా చేస్తున్న పని ఆపి వచ్చి నా పక్కన నిలబడింది. 'రాగానే బట్టలు ఉతకమని చెప్పాను కదా! బట్టలు ఎప్పుడు ఆరతాయి? రోజూ చెప్పలేక నా ప్రాణం పోతోంది'. గట్టిగానే విసుక్కున్నాను. 'సరేనండి' అని చేతిలో చీపురు పక్కన పెట్టి బట్టల దగ్గిరకు రాబోయింది. "ఆ పని కానియ్యి. మొదలు పెట్టావు కదా!" అంటుంటే బట్టల పని పక్కన పెట్టి చేసే పనిలోకి వెళ్ళింది. 'మాసినవాటిని సబ్బు పెట్టి బాగా ఉతుకు' అని చెప్పి లోపలికి నడిచాను.

సీత పేరుకు తగినట్టే నెమ్మదిగా ఎంతో ఓర్పుగా వుంటుంది. దాని నెమ్మది చూస్తే నాలో అంతర్లీనంగా వున్న చిరాకంతా బయటకు వస్తుంది. నా చిరాకులు, పరాకులు అడపా దడపా దానిమీద చూపిస్తుంటాను. ఏది చెప్పినా వూ అనదు. దాంతో నాకు కోపం ముంచుకొస్తుంది. ఆడపిల్ల పుడితే పనిలోకి ఆసరాగా వుంటుందని చెప్పి వరుసగా నలుగురు మగపిల్లల్ని కని వాళ్ళని పోషించలేక అందరికంటే పెద్దవాణ్ణి కూలిపనికి పంపిస్తుంది. దాని అవసరం కనిపెట్టి నాకు చేతనైన సాయం నేనూ చేస్తుంటాను. ఇంతకు ముందు పనివాళ్ళతో నేను పడిన పాట్లు గుర్తొస్తే ఒక రకంగా దాని సౌమ్యత, ఏమీ మాట్లాడకపోవటం ఎంతో రిలీఫ్ కలిగిస్తాయి. తన పని పూర్తి చేసుకుని వెళ్ళేటప్పుడు చెప్తుంది. ముందుగా డబ్బులు కావాలంటే మాత్రం మొహమాటం లేకుండా అడుగుతుంది.

సీత బెస్తకులానికి చెందినది కావటంతో తనంతట తానే దూరంగా వుండటంతో నేనూ ఆరిన బట్టలు ముట్టుకోనిచ్చేదాన్ని కాదు. ఇంట్లోకి తనూ వచ్చేది కాదు. నేనూ రమ్మనే దాన్ని కాదు. నేను ఇళ్ళు క్లీన్ చెయ్యటానికి ఇబ్బంది పడుతుంటే "ఆ అమ్మాయికి డబ్బులు యిచ్చి చేయించుకోవచ్చుగా" అన్నారు మావారు.

"వాళ్ళు చేపలు పట్టేవాళ్ళు" అన్నాను నేను. "అయితే మాత్రం ఏమయ్యింది? ఈ రోజుల్లో ఇంకా కులాలేమిటి?" అని చిరాకుపడ్డారు ఆయన. ఆ విషయం నా మనసుకూ అనిపిస్తుంది. కానీ చిన్నతనం నుంచి వచ్చిన చాదస్తాలు అలవాట్లు అంత త్వరగా పోవనిపిస్తుంది. మనం పూజించే కృష్ణుడు ఏ కులం? అని అనుకున్నాగానీ సీతను యింట్లోకి మాత్రం రమ్మనాలనిపించేది కాదు.

ఒకరోజు సీత బియ్యం బాగుచెయ్యమంటే చేస్తూనే విచారంగా మొహం పెట్టి "ఇవాళ మా పిల్లలిద్దరికీ చాలా నీరసం చేసిందండి" అంది. అదేంటి? ఏమయ్యింది? అన్నాను ఆతృతగా, పాపం దాని విషయాలు, కష్టసుఖాలు ఎపుడూ తరచి తరచి అడిగితే గానీ చెప్పదు. "స్కూల్లో టీచర్లు బోదకాలు బిళ్ళలు యిచ్చారండి రాత్రి యిద్దరూ వేసుకుని పడుకుని అర్ధరాత్రి కూచుని వాంతి చేసుకోడం మొదలెట్టారండి" అంది. "అయ్యో! ఏం చేశావు మరి" అడిగాను నేను బాధపడుతూనే.

"అప్పటి కపుడు ఏమందులు దొరుకుతాయండి? తెల్లారగానే ఇక్కడ కొట్లో బిళ్ళలు కొని వేశాక తగ్గాయండి" అంది. పాపం చీకట్లో అర్ధరాత్రి కరెంటులేక ఎలా ఎన్ని అవస్థలు పడిందో. మనం ఇన్ని సౌకర్యాలున్నా గానీ విసుగులూ చిరాకులూను అనుకున్నాను జాలిగా.

"నువ్వుంటున్నది సొంత ఇల్లేనా?" అడిగాను నేను.

"తాటాకిల్లండి. చంద్రబాబు నాయుడు పార్టీ వాళ్ళు యిల్లు కట్టిస్తామని 1500 కట్టించుకున్నారండి.. ఇప్పుడు ఎన్నికలు గదండి తర్వాత కడతామన్నారు" అంది.

ఎలక్షన్లు జరగడం ప్రతిపక్షం అధికారంలోకి రావటం జరిగింది. సీత వాళ్ళు యిల్లు కట్టించటం మొదలు పెట్టారని, మేస్త్రీలు వచ్చినా గానీ కూలీపని తామే చేసుకోవాలని సాయంత్రం 5 గం॥లకు పనికి వచ్చేది. అలసిపోయిన దాని మొహం చూసి జాలేసి రాగానే ముందు కాఫీ టిఫిన్ యిచ్చేదాన్ని. పని అయిన తర్వాత వెళ్ళిపోబోతుంటే నేను మంచి నీళ్ళు పట్టుకుని బిందెలో పైకి ఎక్కబోతుంటే కాలుజారి పడిపోయాను. ఎంత ప్రయత్నించినా లేవలేకపోయేసరికి సందేహిస్తూనే సీత నా చెయ్యి పట్టుకోబోయి ఆగిపోయింది. బాధతో నాకు కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే ఎలాగో లేవబోయి లేవలేక అక్కడే కూర్చుండిపోయాను. ఇంక సీత నా రెండు చేతులూ పట్టుకుని లేవదీసింది. నేను గోడ ఆసరాగా పట్టుకుని అడుగు వెయ్యలేక వేస్తుంటే "లేవలేకపోతున్నారని పట్టుకున్నానండి" అంది తప్పుచేసిన దానిలా తలవంచుకుని. నేను ఫరవాలేదన్నట్టుగా నవ్వి తలవూపి నెమ్మదిగా ఇంట్లోకి నడిచి హాల్ లోపల కూర్చున్నాను కుర్చీలో. ఇంట్లో ఎవరూ లేరు. కాలు కదపనివ్వటంలేదు.

సీత 'వుంటానండి' అని చెప్పి వెళ్ళిపోయింది. అలమార్లో ఆయింట్‌మెంట్ వుందిగానీ అది తీసుకుందామంటే లేవటానికి కాలు సహకరించటంలేదు. పైగా సీత పట్టుకుని లేవదియ్యటంతో నా ఒళ్ళంతా చేపల కంపు కొడుతున్నట్లు ఫీలింగ్ ఒకటి. మా అమ్మమ్మ చాదస్తం, ఆచారం నాకు కూడా వచ్చినట్టుంది. వెంటనే స్నానం చెయ్యాలని పించింది. ఈలోగా ఆయన, పిల్లలు వచ్చారు. విషయం విని ఆయన ఆయింట్ మెంట్ తీసి యిచ్చి మా అమ్మాయితో మీ అమ్మకు రాయమ్మా అన్నారు. "వద్దులేమ్మా నేను రాసుకుంటాను అని నెమ్మదిగా రాసుకుంటుంటే ఈలోగా వాళ్ళు భోజనాల ఏర్పాటు చేశారు. ఆరోజు వంట త్వరగా చేసెయ్యటం వల్ల వంట సమస్య రాలేదు. మా అబ్బాయి టాబ్లెట్లు తీసుకొచ్చి యిచ్చాడు. అది వేసుకుని టేబుల్‌మీద భోజనం చేసి పడుకున్నాను.

తెల్లవారేసరికి మెలకువ వచ్చి అలవాటుగా లేవబోయాను. కాలునొప్పితో కలుక్కుమంది. 'ఎలాగరా బాబూ' అనుకుని ఆయనను, పిల్లలను లేపక తప్పలేదు. వాళ్ళు విసుక్కుంటూనే లేచారు. "తప్పదు మరి రోజూ నేనే చేసుకుంటున్నాను కదా!" అన్నాను కోప్పడుతూనే. వాళ్ళ సాయంతో ఎలాగోలా వంటపని, బాక్సులు సర్ది ఆయనను ఆఫీసుకు పంపడం చేశాను. "సాయంత్రం హాస్పిటల్‌కి వెళ్దాం రడీగా వుండు అన్నారు" ఆఫీసుకెళ్ళే టపుడు. మధ్యాహ్నం తన పని టైముకి సీత వచ్చింది. నేను కదలలేక పోవడం చూసి "ఆ మందు ఇలాగివ్వండి నేను రాస్తాను" అని కాలు సాగదీసి రాయటం మొదలెట్టింది అవసరం నాదికదా! అందుకని యిష్టం లేకపోయినా మాట్లాడకుండా వూరుకున్నాను. ఒక అరగంటసేపు రాసిన తర్వాత పనంతా పూర్తి చేసి వచ్చిన సీత నేను తలుపు ఆసరాగా చేసుకొని రెండడుగులు వేసినా నడవలేక పోవటం చూసి "రేపు కూడా రాస్తానండి" అని చెప్పి వెళ్ళిపోయింది.. సాయంత్రం ఆయన ఆఫీసులో పని వల్ల లేటుగా వస్తానని హాస్పిటల్‌కు రేపు వెళ్దామని ఫోన్ చేశారు.

మర్నాడు ఉదయం వస్తూనే నొప్పి తగ్గిందాండి? అంది సీత. నిజంగానే ఉదయానికి కొద్దిగా రిలీఫ్ అనిపించింది. వేసుకుంటున్న టాబ్లెట్స్ వల్లనో, లేక సీత చేతి మహిమో నాకు తెలియదుగానీ అంతకుముందు రోజున్నంత నొప్పిలేదనిపించింది. ఆయన లేచిన తర్వాత నొప్పి ఎలా వుందని అడగగానే నేను చెప్పిన మాట విని "ఇంక నొప్పి తగ్గిపోయింది కదా! హాస్పిటల్‌కు వెళ్ళక్కర్లేదేమో" అన్నారు. "అలాగే పాపం. ఎందుకక్కర్లేదు? వెళ్ళాలి అన్నాను నేను". "అవున్లే పాపం. ఎక్స్‌రే-లు అవీ తీయిస్తేగానీ ఏమీ లేదని తేలదు కదా!" అన్నారు ఆయన వేళాకోళంగా. నాకు ఇంక పట్టరాని కోపం వచ్చి పట్టుదలగా ఆయన రమ్మని బ్రతిమాలినా గానీ హాస్పిటల్‌కు వెళ్ళలేదు. వేసుకునే టాబ్లెట్స్ కూడా వేసుకోవడం మానేసి సీత రాక కోసం ఎదురు చూడసాగాను. నా మనసు ఆటోమాటిక్‌గా దాని సేవల పట్ల సుముఖత చూపసాగింది ఈయన వేళాకోళం చేయటంతో. సీత వచ్చి పని పూర్తి చేసుకుని టీ త్రాగాక "మందు రాయమంటారా?" అని అడిగింది. సిన్సియర్ స్టూడెంట్‌లా నా దగ్గిరకు వచ్చి ఉదయం జరిగిన రెండు సంఘటనలు గుర్తొచ్చాయి. పూలుకోయబోతూ పడబోతుంటే పట్టుకొని ఆపింది సీత. ఆ వెంటనే బాత్‌రూంలోకి బక్కెట్ తీసికెళ్ళబోతుంటే వారించి తనే లోపల పెట్టింది. రెండు రోజుల నుండీ దాని సేవలు వరుసగా అందుకుంటున్న నాకు ఒక్కసారిగా నవ్వుతో పాటు దాని మీద అభిమానం ముంచుకొచ్చింది. "పాపం పిచ్చిది" నేను బాధ పడుతున్నానని అడుగుతోంది. దానికేమవసరం అనుకుని సరే అన్నాను. సీత ఆయింట్‌మెంట్ కాలునొక్కి రాస్తుంటే బాధతో వచ్చిన కన్నీళ్ళతోపాటు ఏదో తెలియని భావం నా మనసును ఆవరించింది. ఆ క్షణంలో దాని పట్ల నాకు వున్న అల్పత్వ భావనలన్నీ గాలికెగిరి పోయినట్లనిపిస్తుంటే నిర్మలంగా వున్న సీత మొహంలోకి మౌనంగా చూస్తున్నాను.

ఇంతట్లో ఎపుడు వచ్చారో ఆయన ఆఫీసు నుంచి నా వెనకాల నిలబడి "ఏం పాపం వాళ్ళు బెస్తవాళ్ళు కదా! తన వాసనలు నీకు అంటుకుంటాయేమో?" అన్నారు వెటకారంగా. "చాల్లెండి అవన్నీ నేను ఎపుడో వదిలేశాను అన్నాను నేను తను ఎక్కడ వింటుందోనని చూస్తూ. సీత ఈ లోకం మరిచి పోయినట్లుగా టి.వి.లో సినిమా చూస్తుంటే మా వారు నాలో వచ్చిన పరివర్తనకు ఆశ్చర్యపోతూ నన్నే నమ్మలేనట్లుగా చూస్తున్నారు.